క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులను అందిస్తున్న నాయకులు

జక్రాన్‌పల్లి : మండలంలోని చింతలూరు గ్రామానికి చెందిన బాధితులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కొలిప్యాక్ సొసైటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్ పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన నాగుల ప్రవళిక రూ.18 వేలు, నాగుల గంగారాం రూ.36 వేలు, గోపిడి గంగుబాయి రూ.46,500, దూలం రాజేశ్వర్ రూ.17 వేలు, వడ్ల , భూమన్న రూ.60 వేలు, పుప్పాల బుజ్జన్న రూ. 22, 500 మంజూరయ్యాయి.నిజామాబాదు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి సహకారంతో మంజూరైన చెక్కులకు బాధితులకు అందించామని శ్రీనివాస్ అన్నారు.కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ సెక్రటరీ నాగుల గోపి, గ్రామ శాఖ అధ్యక్షుడు పుప్పాల గంగాధర్, మాజీ ఉపసర్పంచ్ జలందర్, గోపిడి చిన్నరెడ్డి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మధుసూదన్‌రావుకు ఎన్టీఆర్ జాతీయ పురస్కారం


జాతీయ పురస్కారం అందుకుంటున్న మధుసూదన్‌రావు

నిజామాబాద్ రూరల్: సేవా రంగంలో బి.మధుసూధనరావు అందిస్తున్న సేవలకు ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలోని త్యాగరాయ గాన సభలో కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు ఇండియన్ కల్చర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు వెలుగు జాతీయ సాహితీ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రాత్రి కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గ్రహీత వంగాల శాంతికృష్ణ, ప్రముఖ సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, తెలుగు వెలుగు స్వచ్ఛంద సేవా సమితి జాతీయ అధ్యక్షులు పోలోజు రాజ్‌కుమార్‌లు మధుసూదన్‌రావుకు ఎన్టీఆర్ జాతీయ పురస్కారాన్ని అందజేశారు.పోస్టల్ రిటైర్డ్ ఉద్యోగులు, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ , రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సభ్యులు మధుసూదన్‌రావుకు అభినందనలు తెలిపారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి


మాట్లాడుతున్న రజనీకాంత్

నిజామాబాద్‌అర్బన్ : పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజినీకాంత్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం దారుణం అన్నారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ డిగ్రీ కాలేజీల యజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కీం సంబంధించిన బకాయిలను కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలలో ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో స్కావెంజర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్, దీపిక, దినేష్, ఆజాద్, గోవింద్, వీణ, తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	98,800	వెండి(కిలో)	1,13,500
22 క్యారెట్స్	91,205	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	160
	(కిలోకు)	లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	70	పచ్చిమిర్చి	60	90
బీరకాయ	40	70	దోసకాయ	20	40
దొండకాయ	30	60	ఆలుగడ్డ	25	50
బీర్నీసుకాయ	80	120	గోబిగడ్డ	10	20
కాకరకాయ	40	60	గోబిపువ్వు	40	70
వంకాయ	40	60	బీట్‌రూట్	30	60
పాలకూర	30	50	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	35	60
కొత్తిమీర	30	50	చిక్కుడుకాయ	45	75
పుదీనా	60	90	గోరుచిక్కుడు	30	60
క్యాప్సికం	50	90			

-సుభాష్‌నగర్

ఆటలకు అడ్డుగోడ

- నగరంలోని మారుతీనగర్ పార్కులో రాత్రికి రాత్రే ప్రహరీ నిర్మాణం
- కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని కాలనీవాసుల ఆరోపణ
- మున్సిపల్ అధికారులు స్పందించాలని వినతి


మారుతీనగర్ పార్కులో అడ్డుగా నిర్మించిన ప్రహరీ



మారుతీనగర్ కమ్యూనిటీ హాల్

నిజామాబాద్‌నాగారం : నగరంలోని మారుతీనగర్ కాలనీలో రోడ్ నంబర్–5 ప్రాంతంలోని పార్క్‌లో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సిమెంట్ ఇటుకలతో తాత్కాలిక గోడను నిర్మించారు. ప్రభుత్వ పార్కు స్థలాన్ని కబ్జా చేయడానికే అడ్డంగా ప్రహరీ నిర్మించారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పార్కుకు సుమారు 2వేల గజాల వరకు స్థలం ఉంది. పార్కు లోనే మారుతినగర్ కమ్యూనిటీ హాల్‌ను 2011లో సీడీఎఫ్(ఎంఎల్ఎ) నిధులతో నిర్మించారు. దీని చుట్టూ వాకింగ్ ట్రాక్‌ను నిర్మించారు. చిన్నారులు ఆడుకోవడానికి ఉయ్యాల, ఇతర సామగ్రి ఉంది. పెద్దలకోసం ఓపెన్ జిమ్ ఉంది. దీంతో పాటు పాదచారులు వాకింగ్ చేసుకోవడానికి ఉన్న ట్రాక్ కాస్త కూడా ప్రహరీ నిర్మాణంతో కుదించారు. ప్రభుత్వ స్థలం పార్కులో ప్రహరీ ఎలా నిర్మిస్తారని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. దీంతో చిన్నారులు ఆటలు ఆడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. కమ్యూనిటీ హాల్‌లో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ స్థలం కబ్జా వ్యవహారంపై మున్సిపల్ అధికారులు స్పందించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వాకింగ్ చేయడానికి ఇబ్బందులు



పార్కు స్థలం కబ్జా చేయడం కోసం పాదచారులు, పిల్లలు ఎవ్వరు రాకుండా ఉండేందుకు ప్రహరీ నిర్మించారని ఆరోపణలున్నాయి.పార్కులో అక్రమంగా ప్రహరీ నిర్మించడంతో పాదచారులు వాకింగ్ చేయడానికి ఇబ్బంది పడుతున్నారు.

–నర్సాగౌడ్, మారుతీనగర్

ప్రైవేట్ వ్యక్తులు చేపట్టే నిర్మాణాలు తొలగిస్తాం

పార్కులకు సంబంధించి 10 శాతం స్థలాలు ప్రభుత్వానికి చెందినవి. అందులో ఎలాంటి నిర్మాణాలు చేపటొద్దు. ప్రజలకు అవసరమైన వాటిని ప్రభుత్వమే చేస్తుంది. ప్రైవేట్ వ్యక్తులు చేపట్టే నిర్మాణాలు తొలగిస్తాం.

–మురళీమోహన్‌రెడ్డి, ఈఈ

నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలి



మాట్లాడుతున్న సీపీ, హాజరైన కోర్టు సిబ్బంది

- సీపీ సాయిచైతన్య
- కోర్టు డ్యూటీ సిబ్బందితో సమీక్ష

ఖలీల్‌వాడి: ప్రజలకు న్యాయం అందించడంలో కోర్టు డ్యూటీలో ఉండే పోలీసు సిబ్బంది పాత్ర కీలకమని సీపీ సాయి చైతన్య అన్నారు. కోర్టు సమయానికి హాజరై, సాక్షులను సురక్షితంగా హాజరుపర్చి నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలని సూచించారు. నగరంలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ హాల్‌లో కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లతో ఆదివారం సీపీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకాన్ని పెంచేలా విధులు నిర్వర్తించాలన్నారు. సిబ్బంది పనితీరు, ప్రవర్తన, సమయపాలన , నైతిక విలువలు పోలీసుల క్రమశిక్షణను ప్రతిబింబిస్తాయన్నారు. నిజాయితీ, నిబద్ధతతో సేవలు అందించాలన్నారు. పోలీసు శాఖ గౌరవాన్ని మరింత పెంచేలా ముందుకు సాగాలని, భవిష్యత్తులో సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. లాంగ్ పెండింగ్ కేసులు త్వరితగతిన డిస్పోజల్ చేయాలని, ప్రధాన కేసులలో సంబంధిత ఎస్సై, సీఐ, ఏసీపీలతో బ్రీఫింగ్ చేయించాలని చెప్పారు. సమన్లు, వారెంట్స్ ఎప్పటికప్పుడు ఇవ్వాలని, కోర్టులో చార్జ్‌షీట్ వేసే ముందు అన్ని పత్రాలు జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వా రెడ్డి, కోర్ట్ లైజన్ ఆఫీసర్ శ్యామ్ కుమార్, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పద్మశాలి సంఘం కార్యవర్గం నియామకం


జిల్లా అధ్యక్షుడు మైసల నారాయణ


ప్రధాన కార్యదర్శి బొడ్డు గంగప్రసాద్

నిజామాబాద్ నాగారం: అఖిల భారతీయ పద్మశాలి సంఘం సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ దాసరి నర్సింహులు జిల్లా పద్మశాలి సంఘ కార్యవర్గాన్ని ఆదివారం ఖలీల్‌వాడిలోని జిల్లా సంఘ భవనంలో ప్రకటించారు. నిజామాబాద్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా మైసల నారాయణ, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు గంగప్రసాద్, ఉపాధ్యక్షులుగా గాలిపల్లి నారాయణ, పాము రమేష్, అంకం జగదీష్, గంగుల దత్తాత్రి, ఆరుట్ల రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శులుగా దేవల్‌బజరంగ్, పద్మసుభాష్, సాంబారు తిరుపతి, ఆర్గనైజింగ్ సెక్రటరిగా ఉప్పరపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కూరపాటి వెంకట్, కోశాధికారిగా దిండిగల్ల శంకర్, సలహాదారులుగా డా.ఎం. శ్రీహరి, డా.సుభాష్, డా.కేశవులు, పెంట దత్తాత్రి, కన్నా శ్రీనివాస్, ఉప్పరపల్లి శ్రీనివాస్‌లు, కార్యవర్గ సభ్యులుగా గర్దాస్ శంకర్, ఆడెపు రాజన్న, వితం వెంకటరమణ, జిట్ల బాలరాజు, గండి గణేష్, షేర్ పల్లి బాబురావులను నియమించారు.

సేవ కార్యక్రమాలను విస్తృతం చేయాలి


లయన్స్ సమాచార పత్రికను ఆవిష్కరిస్తున్న క్లబ్ సభ్యులు

నిజామాబాద్‌నాగారం : నూతన సభ్యత్వంపై దృష్టి సారించి, సేవ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్ పి.లక్ష్మి పేర్కొన్నారు.లయన్స్ ఇంటర్నేషనల్ నిజామాబాదు రీజియన్ అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారుల సమావేశం శనివారం రాత్రి నగరంలోని సందీప్ గార్డెన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్ పి.లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.నిజామాబాదు రీజియన్ చైర్మెన్ ఉదయ సూర్యభగవాన్ సంపాదకత్వంలో ముద్రించిన లయన్స్ సమాచార దర్శిని మాస పత్రికను పూర్వ గవర్నర్ లక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల ఒకటిన శుభారంభ్ పేరిట నిజామాబాదు రీజియన్ పరిధిలో ఒకే రోజు 85 సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.సేవా కార్యక్రమాల సమాచారం కోసం నెలవారీ సమాచార దర్శినిని ముద్రించడం గొప్ప విషయమన్నారు. మత్తు పదార్థాలపై అవగాహన కల్పించేందుకు లయన్స్ జిల్లా యాంటీ డ్రగ్స్ చైర్మెన్ జిల్కర్ విజయానంద్ రూపొందించిన స్టిక్కర్లు, బ్యానర్లు, బ్యాడ్జీలను ఈ సందర్భంగా లక్ష్మి ఆవిష్కరించారు. లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్లు డి.పెంటయ్య, ఇరుకుల వీరేశం, జిల్లా అదనపు కోశాధికారి పి.లక్ష్మీనారాయణ, రీజియన్ చైర్మెన్ ఉదయ సూర్య భగవాన్, రీజియన్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, రీజియన్ పీఆర్వో చింతల గంగాదాస్, జోన్ చైర్మన్లు దారం భూమన్న, కాలేరుఅవన్ కుమార్, బొబ్బ నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేట్‌కు దీటుగా మాక్లూర్ పీహెచ్‌సీ


ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం వచ్చిన రోగులు

- రక్తపరీక్షలు చేయడంలో ముందంజ
- రోగులకు మెరుగైన వైద్య సేవలు

మాక్లూర్: ప్రయివేట్‌కు దీటుగా మాక్లూర్ పీహెచ్‌సీ వైద్యసేవలు అందిస్తోంది. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు గడిచిన 6 నెలల కాలంలో సుమారు 12 వందల మందికి ఆయా రకాల వ్యాధులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈపరీక్షల నిర్వహణలో పీహెచ్‌సీ జిల్లాలో ముందంజలో ఉందని వైద్యుడు రవిశంకర్ వెల్లడించారు. ప్రతి గురువారం గర్భిణులకు ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందిస్తున్నారు.ఆధునాతనమైన ల్యాబ్ సౌకర్యంతో కోలాస్ట్రల్, లిపిడ్ ప్రొఫైల్, గర్భిణులకు థైరాయిడ్, వృద్ధులకు కాల్షియం యూరిక్ యాసిడ్, ఫాస్టింగ్ లంచ్ షుగర్, కిడ్నీ సంబంధిత పరీక్షలు మొత్తం 19 రకాల రక్తపరీక్షలు చేస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ అందుబాటులో ఉన్నారు. దీంతో పీహెచ్‌సీకి వచ్చే రోగుల సంఖ్య కూడా పెరిగింది. రోజుకు 10 నుంచి 20 మందికి రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు.

వైద్యం అందించడంలో నిర్లక్ష్యం ఉండదు



పీహెచ్‌సీలో వైద్యం అందించడంలో నిర్లక్ష్యం ఉండదు. రోగులతో మాట్లా డి వివరాలు తెలుసుకొని వైద్యం అందిస్తున్నా. సంబంధిత జబ్బుకు రక్త పరీక్ష చేయిస్తాం. ఆస్పత్రికి వచ్చే రోగులు వైద్యం పొంది సంతృప్తిగా వెళ్తున్నారు.

– రవిశంకర్, వైద్యుడు, మాక్లూర్ పీహెచ్‌సీ

వైద్యసేవలు బాగున్నాయి

ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలు బాగున్నాయి. వివిధ రకాల జబ్బులతో బాధపడుతూ వచ్చిన రోగులకు ముందుగా రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. తర్వాతనే తగిన మందులు ఇస్తున్నారు.

– గంగాధర్, స్థానికుడు, మాక్లూర్

నేటి చిత్రం



ముళ్ల పొదలు తొలగించాలి

సిరికొండ : మండల కేంద్రం శివారు నుంచి రాజన్న సిరిసిల్లా జిల్లా వైపు వెళ్లే మార్గంలో మూలమలుపు వద్ద ముళ్ల పొదలు విపరీతంగా పెరిగిపోయాయి. ముళ్ల పొదల కారణంగా మూలమలుపు కనిపించడం లేదు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి ముళ్ల పొదలను తొలగింపచేయాలి.

– గంగాధర్, సిరికొండ

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

నిజామాబాద్ అర్బన్ - 95531 30597 | నిజామాబాద్ రూరల్ - 97053 46541

గ్రామాల్లో వన భోజనాల సందడి


పడకల్‌లో వన భోజనాలకు వెళ్లిన గ్రామస్తులు

డిచ్‌పల్లి/నిజామాబాద్ రూరల్/సిరికొండ/జక్రాన్‌పల్లి : రూరల్ నియోజకవర్గంలోని మండలాల్లోని గ్రామాల్లో ఆదివారం వన భోజనాల సందడి నెలకొంది. వర్షాలు బాగా కురిపించాలని, పాడి పంట చల్లగా ఉండాలని గ్రామ దేవతలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆషాడ మాసంలో ప్రజలు వన భోజనాలకు వెళ్తారు. కుటుంబసభ్యులు, బంధు మిత్రులతో కలిసి గ్రామశివారు ప్రదేశాలకు వెళ్లి విందు భోజనాలు ఆరగించారు. భోజనాల అనంతరం పిల్లలు పెద్దలు ఆటలు ఆడుతు నృత్యాలు చేశారు.


డిచ్‌పల్లిలోని గాయత్రి ఎన్‌క్లేవ్‌లో వన భోజనాలు చేస్తున్న కుటుంబం


సిరికొండలో వన భోజనాలు చేస్తున్న స్థానికులు


సారంగాపూర్‌లో..

కలగానే డిగ్రీ కాలేజీ ఏర్పాటు

- ఇందల్వాయి మండలంలో స్థల సేకరణ వద్దే ఆగిన పనులు
- నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్న విద్యార్థినులు
- భూనిర్వాసితులకు దక్కని పరిహారం


గన్నారంలో డిగ్రీ కాలేజీ కోసం సేకరించిన స్థలం

ఇందల్వాయి: ఇందల్వాయి మండలంలో మహిళ డిగ్రీ కాలేజీ నిర్మాణం కలగానే మిగిలిపోనుందని విద్యార్థినులు నిరాశ చెందుతున్నారు. 2021 సంవత్సరంలో గన్నారం గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కన సర్వే నంబరు 1186లో సుమారు ఏడు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని సేకరించారు. ఈపనులకు అప్పటి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఎలాంటి నిధులు మంజూరు కాకపోవడంతో పనులు కూడా ప్రారంభం కాలేదు.

దూర ప్రాంతాలకు వెళ్తున్న విద్యార్థినులు. . .

ఏళ్లుగా డిగ్రీ కాలేజీ పనులు పూర్తి కాకపోవడంతో మండలానికి చెందిన విద్యార్థినులు ఉన్నత చదువుల కోసం వ్యయ ప్రయాసలకు ఓర్చి డిచ్‌పల్లి, నిజామాబాద్‌లకు వెళ్తున్నారు. నిత్యం రద్దీ బస్సుల్లో రాకపోకలు సాగించడం ఇబ్బందికరంగా ఉంటుందని మండలంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందని ఇక్కడి ప్రాంతవాసులు కోరుతున్నారు. అలాగే విద్యార్థినుల్లో మధ్య లో చదువు మానేసే వారి శాతం తగ్గుతుందని విద్యార్థులు, తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

కాలేజీ నిర్మిస్తే ఎంతో ఉపయోగం

మండలంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తే 23 గ్రామాల పేద,మధ్య తరగతి విద్యార్థినులకు ఉపయోగకరంగా ఉంటుంది. కాలేజీ లేక నిత్యం రద్దీ బస్సుల్లో దూర ప్రాంతాల్లో ఉన్న కాలేజీలకు వెళ్లలేక ఎంతో మంది అమ్మాయిలు మధ్యలోనే చదువు ఆపేస్తున్నారు. ప్రైవేటు కాలేజీల్లో ఫీజులు కట్టలేక కూడా ఇబ్బందులు పడుతున్నారు.

కబ్జాకు గురవుతున్న స్థలం..!

కాలేజీ ఏర్పాటు ఆలస్యం అవుతున్న సంబంధిత స్థలం కబ్జాకు గురవుతుందని గన్నారం గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెట్లు పొదలతో నిండిన కాలేజీ స్థలాన్ని సర్వే చేసి చదును చేసి హద్దులు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. ఇదిలా ఉండగా కాలేజీ కోసం సేకరించిన ఏడు ఎకరాల స్థలంలో గన్నారం గ్రామానికి చెందిన కుంట రాజేశ్వర్ రెడ్డికి చెందిన ఐదు ఎకరాలు, మరో వ్యక్తికి రెండు ఎకరాలు ఉంది. ఇప్పటి వరకు వారికి వేరే చోట భూమి కానీ, ఎలాంటి నష్ట పరిహారం అందలేదని బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలేజి ఏర్పాటు సాధ్యం కాకపోతే తమ స్థలాన్ని తమకు అప్పగించాలని కోరుతున్నారు.

స్థలం తిరిగి ఇవ్వాలి



కాలేజీ నిర్మాణం కోసం ఐదేళ్ల క్రితం మా వద్ద నుంచి స్థలాన్ని సేకరించారు. ఇప్పటి వరకు ఎలాంటి పరిహారం అందించలేదు. ఇంతవరకు కాలేజీ కూడా కట్టకపోవడం వల్ల స్థలం కాస్తా కబ్జాకి గురవుతుంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి కాలేజీ స్థలానికి ఫెన్సింగ్ వేసి నిర్మాణ పనులు ప్రారంభించాలి. లేదంటే మా స్థలం మాకు తిరిగి అప్పగించాలి.

–కుంట రాజేశ్వర్‌రెడ్డి, భూనిర్వాసితుడు, గన్నారం

నిలిచిన సైన్స్ ల్యాబ్ భవనాల నిర్మాణం


నూత్‌పల్లి జెడ్పీ స్కూల్‌లో నిర్మాణం మధ్యలో ఉన్న సైన్స్ ల్యాబ్ భవనం

డొంకేశ్వర్: మండలంలోని నూత్‌పల్లి, గాదేపల్లి జె డ్పీ పాఠశాలలకు రెండేళ్ల క్రితం సైన్స్ ల్యాబ్‌లు మంజూరు అయ్యాయి. కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో పనులు మధ్యలో నిలిచిపోయాయి. ప్రభు త్వ పాఠశాలల్లో చదువుతు న్న విద్యార్థుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ల్యాబ్‌లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకు మండలానికి రెండు భవనాలు మంజూరు చేయగా ఒక్కో దానికి రూ.13.5లక్షలు కేటాయించింది. నిర్మించే బాధ్యతలను సాంఘిక సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ చూస్తుండగా, 2023లో ఓ కాంట్రాక్టర్‌కు టెండరు అప్పగించారు. ప్రస్తుతం నూత్‌పల్లి, గాదేపల్లిలలో స్లాబు వరకు నిర్మాణ పనులు జరిగాయి. ల్యాబ్ లు అందుబాటులో లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)

Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

ఆర్మూర్ సి. ప్రభాకర్ ACO : 9010585333
నిజామాబాద్ అర్బన్ జి. రాంనాథ్ : 9849180084
నిజామాబాద్ రూరల్ ఎం. రాజేంధర్ : 9666958559
బాల్కొండ ప్రదీప్ : 7893150102
బోధన్ ఎ.శివ : 9848956776
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899